ఆర్‌యూ అభివృద్ధికి కృషి చేస్తా

- రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్



కర్నూలు అర్బన్, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన వర్సిటీలో రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ సొంత జిల్లాలో యూనివర్సిటీకి రిజిస్ట్రార్‌గా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎంపికకు సహకరించిన ప్రభుత్వానికి, జిల్లా ప్రజాప్రతినిధులు, వర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల ఆచార్యులు, ఆధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు అయనకు శుభాకాంక్షలు తెలిపారు.

దేవరగట్టుపై పోలీసుల ఆరా!



ఆలూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : విజయదశమి రోజు దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి జరిగిన బన్ని (కర్రల సమరం) ఉత్సవంలో ఘర్షణలకు పాల్పడిన వారిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రశాంతంగా జరిగే ఉత్సవాల్లో ఘర్షణలు తావిచ్చిన వైనంపై పోలీసులు సీరియస్‌గా ఉన్నారు. నేరణికి, అరికేర గ్రామస్థులు మధ్య జరిగిన ఘర్షణల్లో ఒకరిపై ఒక్కరూ కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో కొందరికి గాయాలయ్యాయి. ఈ విషయంపై పోలీసులు సీసీ పుటేజీల ద్వారా ఘర్షణ జరిగిన తీరును నిశితంగా పరిశీలిస్తున్నారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఉత్సవాలను తిలకిస్తుండగానే ఇలాంటి ఘర్షణలు జరగడంపై పోలీసులు అన్నీ కోణాల్లో ఆరా తీస్తున్నారు.

తెలుపు రంగులోకి...



మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పరిమళ ప్రసాదం కాషాయం రంగు నుంచి తెలుపు రంగులోకి మారింది. ద్విదళ వ్రతం పురస్కరించుకుని నవంబరు 12 వరకు తెలుపు రంగులోనే పరిమళ ప్రసాదాన్ని భక్తులకు అందజేస్తారు. సాధారణంగా పరిమళ ప్రసాదాన్ని రవ్వ, చక్కెర, ఎండు ద్రాక్ష, గోడంబి, యాలుకలు, పచ్చ కర్పూరం, కేసరి రంగును వినియోగించి తయారు చేస్తారు. ద్విదళ వ్రతంలో మాత్రం మధ్వ సంప్రదాయం ప్రకారం ఈ నెలలో యాలుక, కేసరి రంగు, గోడంబి, ద్రాక్షలను వినియోగించరు. కేవలం రవ్వ, చక్కెరతో తెలుపు రంగులో ప్రసాదాన్ని తయారు చేస్తారు. మిగిలిన రోజుల్లో కేసరి రంగులో ప్రసాదం ఉంటుంది. కూరగాయల్లో కేవలం అరటి మాత్రమే ఉపయోగిస్తారు.

అతలాకుతలం



పగిడ్యాలలో నీటమునిగిన పొగాకు పంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వణికిపోతోంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. మొక్కజొన్న, వరి, పంట పంటలు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు, కల్వర్టులు పూర్తిగా నాశనమయ్యాయి. నందికొట్కూరు పట్టణంలో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లలోకి నీరు వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాగలమర్రి మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద ఉధృతి తగ్గలేదు. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించి పోయాయి. అలాగే ఎనిమిది మట్టిమిద్దెలు కూలాయి. రుద్రవరం మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు గ్రామాల వద్ద వక్కిలేరు వాగు పొంగి ప్రవహించింది. రాకపోకలు నిలిచిపోయాయి.


6లో

ఉల్లి రైతును ముంచిన వర్షం

● పొలాల్లో నిలిచిపోయిన నీరు ● ఉల్లి రైతులకు కన్నీరు



ఉల్లిగడ్డలను కాపాడుకుంటున్న రైతులు



గోనెగండ్ల, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షం కారణంగా ఉల్లి రైతులు కష్టాల్లో పడ్డారు. పంట చేతికి అందే సమయంలో వర్షం ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో ఉల్లి పంటకు మజ్జిగ తెలుగు సోకి పంట నేలకు వాలిపోయింది. దీంతో ఉల్లి గడ్డ కుళ్లిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటను కోసే అదును రాకపోయినా విధిలేక ఉల్లిగడ్డలను కోయాల్సి వస్తోందని అంటున్నారు. వర్షం కురుస్తుండటంతో పంటను కోసి పొలంలోనే వదిలివేస్తున్నారు. దీంతో తడిసి గడ్డలు కుళ్లిపోతున్నాయి. ప్రస్తుతం ఉల్లి ధర ఆశాజనకంగా ఉంది. అయితే అదును రాకముందే కోసిన ఉల్లిని మార్కెట్‌కు తీసుకువెళితే ధర పలకడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉల్లి క్వింటం ధర రూ. 3500 నుంచి రూ. 4000 వరకు పలుకుతోంది. ఎకరా ఉల్లి సాగుకు దాదాపు రూ. 90వేల పైగానే ఖర్చు అవుతోంది. అయితే గత ఏడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడి కూడా గణనీయంగా తగ్గిందని రైతులు తెలుపుతున్నారు. ఎకరాకు 50 క్వింటాళ్లు దాటడం లేదని అంటున్నారు. గోనెగండ్ల మండలంలో గోనెగండ్ల, వేముగోడు, అలువాల, గాజులదిన్నె హెచ్ కైరవాడి, కులుమాల, తిప్పనూరు, పుట్టపాశం గ్రామాలతో పాటు మండలంలో పలు గ్రామాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 2500 ఎకరాలలో ఉల్లి ని సాగు చేశారు. నియోజకవర్గంలో 6వేల హెక్టార్లలో ఉల్లిని సాగు చేశారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కోసిన ఉల్లి పంటను చేసేది లేక తడిసిన ఉల్లిని పొలంలో ఆరబోస్తు చెట్ల కింద నిలువ చేసుకున్నారు. ఉల్లిగడ్డలు పొలాల్లోనే కుళ్లిపోయే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి ఉల్లి పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

- రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఆరుగురు సభ్యులతో టీం ఏర్పాటు
- కొత్త పాసు పుస్తకాల అందజేత

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న భూమి రీసర్వే తప్పుల తడకగా నిర్వహించారు. దీంతో రైతులు తమ భూముల సమస్య పరిష్కారం కోసం మండల రెవెన్యూ కార్యాలయం, డీఆర్వో కార్యాలయం, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వైఎస్సార్ జగనన్న భూరక్ష రైతులకు అదనపు తలనొప్పులు తీసుకువచ్చింది. గతంలో ఉండే కొలతలకు భిన్నంగా రీసర్వేలో తేడాలు వచ్చియి. యజమాని పేర్ల మార్పు, సరిహద్దుల్లో లోపాలు మొదలైన సమస్యలు వచ్చాయి. వీటిని సరిచేయడానికి కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. గ్రామసభలను నిర్వహించి ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకోనున్నది.

● 255 గ్రామాల్లో సభలు



కర్నూలు జిల్లాలో 255 గ్రామాల్లో సభలు నిర్వహించేందుకు కార్యక్రమాన్ని రూపొందించారు. ఆదోని మండలలో 27 గ్రామాలు, గోనెగండ్ల మండలంలో 13, హొళగుందలో 7, కోసిగిలో 14, కౌతాళంలో 17, మంత్రాలయంలో 11, నందవరంలో 13, పెద్దకడుబూరులో 16, ఎమ్మిగనూరులో 16, సి. బెళగల్‌లో 8, గూడూరులో 9 , కల్లూరులో 14, కోడుమూరులో 5, కర్నూలు మండలంలో 11, ఓర్వకల్లులో 12, వెల్దుర్తిలో 12, ఆలూరులో 10, ఆస్పరిలో 8, చిప్పగిరిలో 5, దేవనకొండలో 5, హాలహర్విలో 5, క్రిష్ణగిరిలో 3, మద్దికెరలో 3, పత్తికొండలో 6, తుగ్గలిలో 5 గ్రామాల్లో మొత్తం గ్రామసభలు నిర్వహించనున్నారు.

● ఆరుగురు సభ్యులతో టీం

ప్రతి మండలంలో జరగనున్న గ్రామ సభలో మండల తహసీల్దార్, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, మండల ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, విలేజ్ సర్వేయర్ అధికారులు హాజరు కానన్నారు. రైతుల దగ్గర నుంచి రీసర్వే భూ సమస్యలపై వీరు దరఖాస్తులను స్వీకరించనున్నారు.


● జగన్ ఫొటోలు ఉండే పాసు పుస్తకాలు రద్దు

గత ప్రభుత్వంలో జగన్ చిత్రాలతో పట్టాపాసు పుస్తకాలను ముద్రించి రైతులకు అందించారు. పొలాల్లో వేసిన సర్వే రాళ్లపైన జగన్ చిత్రం ముద్రించారు. పాసు పుస్తకాలపై జగన్ చిత్రం ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు, ప్రైవేటు సంస్థలు నిరాకరించాయి.

మిగతా 6లో

ఇరిగేషన్ ఎస్ఈగా బాలచంద్రారెడ్డి

- బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఇన్‌చార్జి ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి అనంతపురం హంద్రీనీవా ఈఈగా బదిలీ



కర్నూలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో పని చేస్తున్న వివిధ జిల్లాల సూపరింటెండెంట్ ఇంజనీర్ల (ఎస్ఈ)ను బదిలీ చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ఈలు లేని జిల్లాల్లో డిప్యూటీ ఎస్ఈ, ఈఈలకు పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్ఏసీ)లు అప్పగించారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా డిప్యూటీ ఎస్ఈ బి. బాలచంద్రారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇగిరేషన్ సర్కిల్ ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా పని చేస్తున్న రెడ్డి శేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లా హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా గత నెల 26న బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఎస్ఈగా మరొకరిని నియమించకపోవడం, ఎఫ్ఏసీ ఇవ్వకపోవడంతో రెడ్డిశేఖర్‌రెడ్డి కొనసాగారు. ఎస్ఈగా నియమితులైన బాలచంద్రారెడ్డి ఒకట్రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఈయన 1989లో ఏఈగా జలవనరుల శాఖలో ఉద్యోగంలో చేరారు. బ్రహ్మంగారి మఠం దగ్గర ఉన్న తెలుగుగంగ బ్రహ్మంసాగర్‌లో విధులు చేపట్టారు. 2002లో డీఈఈ పదోన్నతి వచ్చింది. అన్నమయ్య ప్రాజెక్టు (చెయ్యేరు), గండికోట ప్రాజెక్టుల్లో, ప్రొద్దుటూరు ఎంఐ డీఈఈగా పని చేశారు. 2013లో ఈఈగా పదోన్నతి వచ్చింది. నంద్యాల కేసీ కెనాల్ డివిజన్, తెలుగుగంగా డివిజన్, ఎంఐ డివిజన్‌లో పని చేశారు. 2019లో కడప మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) ఈఈగా బదిలీపై వెళ్లారు. నాటి నుంచి అక్కడే పని చేస్తున్న బాలచంద్రారెడ్డి గత నెలలో జరిగిన బదిలీల్లో కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీపై వచ్చారు. ఆయనకే ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న కర్నూలు ఎస్ఈగా ఎఫ్ఏసీ ఇవ్వడం మరింత బాధ్యత పెరిగిందని, కరువు జిల్లాలో రైతులకు సాగునీరు అందించడమే కాకుండా.. కొత్త ప్రాజెక్టుపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతానని, కింద స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ హోదాల్లో పని చేసే ఇంజనీర్లు, ఉద్యోగులను సమన్వయం చేసుకొని సమష్టిగా పని చేస్తూ రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆంధ్రజ్యోతితో అన్నారు.

మద్యం నిల్వలు ఫుల్

బారులుతీరిన లైసెన్స్‌దారులు

7లో..



రెండు రోజుల్లో నెలసరి వర్షపాతం



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెలలో కురవాల్సిన వర్షపాతం 60.4 ఎంఎం కాగా.. రెండు రోజుల్లో 66.2 ఎంఎం వర్షం నమోదైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గత రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షం కురిసినట్లు నమోదైంది. వెల్దుర్తిలో 51 ఎంఎం వర్షపాతం నమోదైంది. దేవనకొండలో 49.6, కృష్ణగిరిలో 49.2, కల్లూరులో 39 ఎంఎం, కర్నూలు అర్బన్‌లో 30.2, కర్నూలు రూరల్‌లో 29 ఎంఎం, పత్తికొండలో 20, ఓర్వకల్లులో 24.8, చిప్పగిరిలో 24.8, ఆస్పరిలో 22 ఎంఎం, ఆలూరులో 19.2, మద్దికెరలో 16.6, తుగ్గలిలో 15ఎంఎం, హొళగుందలో 10.2, హాలహర్విలో 10.2, కోసిగిలో 9.8, మిగిలిన మండలాల్లో 3 నుంచి 7 ఎంఎం వర్షపాతం నమోదైంది. గురువారం జిల్లా మొత్తం మీద 19 ఎంఎం వర్షం నమోదైంది.

డోన్ సీఐ దాడిపై టీడీపీ సీరియస్

- శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు
- ఘటనపై ఆరా తీసిన సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్
- హోంమంత్రిని కలిసి ఫిర్యాదు చేసిన న్యాయవాదులు

7

సజ్జల డ్రామాలు ఇక ఆపాలి



- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు

7



ఆహ్లాదం.. నగర వనం

ప్రకృతి ప్రియులకు ఆనందం

సెలవుల్లో సందర్శకుల తాకిడి

6లో

మహోన్నత వ్యక్తి వాల్మీకి



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

● సన్మార్గాన్ని నిర్దేశించిన ఆదర్శప్రాయుడు

● జయంతి వేడుకలో కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని మహా అద్భుత కావ్యంగా మలిచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. నగరంలోని గౌరీగోపాల్ హాస్పిటల్ సర్కిల్‌లో ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ప్రజాప్రతినిధులు, వాల్మీకి సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుణ్యభూమి, కర్మభూమి మన భారతదేశమని, రామాయణం మాన పూజ్య గ్రంథమన్నారు. అంతటి గొప్ప గ్రంథాన్ని రచించిన మహర్షి వాల్మీకి అన్నారు. వాల్మీకి మహర్షి రామాయణంలో దాదాపు 24వేల శ్లోకాలు రాశారన్నారు. వాల్మీకి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, పర్యాటక టూరిజం డైరెక్టర్ ముంతాజ్, వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తలారి కృష్ణమనాయుడు, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బీసీ మద్దిలేటి, నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు, వాల్మీకి బోయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి కుబేరస్వామి, బీసీ వెల్ఫేర్ జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ సంఘాల నాయకులు సత్రం రామకృష్ణుడు, దేశం కృష్ణుడు, నందడి మహేష్, ఏపూరి నాగరాజు పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, అధికారులు

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రతిభ

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యశ్వంత్.. పుస్తక సమీక్ష పోటీల్లో తెలుగు బుక్ఆఫ్ రికార్డ్స్‌లో ప్రతిభ కనబరిచాడు. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన ఊరిమల్ల ఫౌండేషన్, అక్షరాల తోవ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 6వ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన పుస్తక సమీక్షలో విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. తెలుగు ఉపాధ్యాయిని ఎం. నాగేశ్వరమ్మ ప్రోత్సాహంతో విద్యార్థి యశ్వంత్ నీతి కథలు అనే పుస్తకంపై సమీక్ష రాశాడు. ఈ సందర్భంగా హెచ్ఎం కాత్యాయని, ఉపాధ్యాయులు విద్యార్థి యశ్వంత్‌ను అభినందించారు.


తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థితో హెచ్ఎం, ఉపాధ్యాయులు

పూర్తిగా నిండిన శ్రీశైలం డ్యాం



శ్రీశైలం, అక్టోబరు 17: శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి గురువారం చేరుకుంది. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 59,936 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 21,555 క్యూసెక్కులు మొత్తం 81,491 వరద నీరు వచ్చింది. గురువారం సాయంత్రం 6 గంటల సమాయానికి జలాశయానికి 79,536 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తిస్థాయి నీటిమట్టం 884.50 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 212.9198 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,876 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,900 క్యూసెక్కులు మొత్తం 67,776 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

ఆహ్లాదం

నగర నందన వనం

ప్రకృతి ప్రియులకు ఆహ్లాదం పంచుతున్న వైనం

సెలవుల్లో సందర్శకుల తాకిడి

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

నగర వనం ఆనందం పంచుతోంది. ప్రకృతి ప్రియులకు ఆహ్లాదం అందిస్తోంది. ఒత్తిళ్లతో కూడిన జీవనం గడుపుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇక్కడి వాతావరణం ప్రశాంతత కలిగిస్తోంది. నగరవాసులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు జిల్లా అటవీ శాఖ నడుం బిగించింది. సరిగ్గా ఏడేళ్ల క్రితం నగర సరిహద్దు ప్రాంతమైన గార్గేయపురం సమీపంలో సహజ సిద్ధమైన వాతావరణంలో ప్రకృతి రమణీయత నడుమ నగర వనానికి రూపకల్పన చేశారు. దాదాపు 5 కి.మీ. విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. సందర్శకుల ఆసక్తి, ఆలోచనలకు అనుగుణంగా పలు ప్రాంతాలను తీర్చిదిద్దారు. వనం మొత్తం చుట్టి రావాటానికి వనదర్శిని పేరుతో ప్రత్యేకంగా రెండు వాహనాలను ఏర్పాటు చేశారు. ఎంతో ఎత్తులో నిర్మించిన వాచ్ టవర్‌పై నుంచి పరిసరాలను పరిశీలిస్తే విహంగ వీక్షణం చేసినంత భావన కలుగుతుంది. ఇక్కడి నుంచి చూస్తే వనంతో పాటు సమీపంలోని తుంగభద్ర నది సైతం ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. సందర్శకులు భోజనం చేయడానికి, సేద దీరేందుకు కుటీరం ఆకృతిలో పలు చోట్ల పగోడ పేరుతో ప్రత్యేక నిర్మాణాలు ఏర్పాటు చేశారు. కుటుంబం సభ్యులు, స్నేహితులతో ఈ ప్రాంతాన్ని సందర్శించిన వారికి ఆనందానికి కొదువ ఉండదంటే అతిశయోక్తి కాదు. అన్ని వయస్సుల వారు ఆడుకునేందుకు ఆట వస్తువులను బిగించారు. యోగా చేసుకునేలా ధ్యాన కేంద్రం అందుబాటులో ఉంచారు. విద్యార్థులు అధ్యయన యాత్రల పేరుతో ఇక్కడికి వచ్చిన యెడల వారి సౌలభ్యం కోసం పవర్ ప్రజంటేషన్ చేసుకునేందుకు అనుకూలంగా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గార్గేయపురం చెరువుకు సమీపంలోని వనంలో అంతర్భాగంగా సహజంగా వెలిసిన రాతిగుండు చూపరులను విశేషంగా అకట్టుకుంటోంది. దీనికి పిల్లిగుండుగా నామకరణం చేశారు. దీనిపై నుంచి కూడా చుట్టుపక్కల పరిసరాలను వీక్షించవచ్చు.









సెలవుల్లో సందడే సందడి

రూ.40 రుసుంతో నగర వనం సందర్శనకు అనుమతిస్తారు. నగర వనాన్ని వాహనంలో చూడాలంటే ఒక్కో వ్యక్తికి రూ.75 చొప్పున వసూలు చేస్తారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బోటింగ్‌కు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. సాధారణ రోజుల్లో ఓ మోస్తరుగా ఉండే సందర్శకులు, సెలవు దినాల్లో కిక్కిరిసి ఉంటారు. ఇక పాఠశాల, కళాశాలల సెలవు రోజుల్లో ఈ తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది.

మరిన్ని ప్రత్యేకతలు

కుటుంబ సమేతంగా, సామూహికంగా విహారానికి వచ్చినప్పుడు ప్రత్యేకించి భోజనం చేసేందుకు రాతి మహల్‌ను నిర్మించారు. నగర వనప్రవేశ ద్వారానికి ఆనుకుని గార్గేయపురం చెరువు ఉంది. ఇక్కడ బోటింగ్ ఆనందంతోపాటు మరపురాని అనుభూతిని అందిస్తోంది. వేసవి కాలంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వలస పక్షులు, నెమళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఫొటో షూట్‌లు, పుట్టిన రోజు, కార్యాలయ కార్యక్రమాలు, పాఠశాల వేడుకలు చేసుకునేందుకు సైతం అధికారికంగా అనుమతి ఇస్తున్నారు. వన సందర్శనకు వచ్చే వారి సౌకర్యార్థం క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఔషధ మొక్కలతో ఉద్యానవనాన్ని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు.





5వ పేజీ తరువాయి

నేటి నుంచి గ్రామ సభలు

వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జగన్ చిత్రంతో ముద్రించి ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలను రద్దు చేసి అధికార చిహ్నంతో కొత్త పాసుపుస్తకాలు ఇవ్వనున్నది.

- **గ్రామ సభలకు పక్కా ఏర్పాట్లు**

కలెక్టర్ ఆదేశాల మేరకు నేటి నుంచి గ్రామ సభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో రీసర్వేలో జరిగిన తప్పులను సరి చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సర్వే సిబ్బంది గ్రామ సభలకు హాజరవుతారు. సమస్యలతో ఇబ్బంది పడే రైతులు భూమి యజమానులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ఫిర్యాదు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇచ్చి భూమిని ఎప్పుడు పరిశీలించేదీ తేదీతో సహా సమాచారం అందజేస్తాం. మండలం వారిగా గ్రామసభ షెడ్యూల్ రూపొందించాం. రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పొరపాట్లు ఆక్రమణలు ఇతర అన్నింటిని గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు.

- మున్ని కన్నన్, జిల్లా భూసర్వే అధికారి

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డికి అవార్డు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నేత్రదానంపై అవగాహన, మరణానంతరం నేత్రాల సేకరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డా. కేజీ గోవిందరెడ్డి చేసిన విశేష సేవలకు ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ విశిష్ట అవార్డును అందజేసింది. ఈ మేరకు ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డా. జీఎన్‌రావు నుంచి హైదరాబాదులో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా. కేజీ గోవిందరెడ్డి అవార్డు, మెమెంటో అందుకున్నారు. గత 20 సంవత్సరాలుగా రెడ్‌క్రాస్ సొసైటీకి చెందిన కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఐ బ్యాంకు ద్వారా డా. గోవిందరెడ్డి నేత్రదాన సేకరణ, అవగాహన 1.50 లక్షల మందితో నేత్రదానం ఇవ్వడానికి అంగీకారం తెలిపేలా కృషి చేశారు. అలాగే 2005 నుంచి నేత్రదానంపై ఆయన పని చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ అవార్డుతో సత్కరించింది.


డా. గోవిందరెడ్డికి మెమెంటో అందజేస్తున్న ఎల్‌వీ ప్రసాద్, ఐ హాస్పిటల్ వ్యవస్థాపకుడు డా.జి.ఎన్ రావు



అక్షరాస్యతతోనే మానవ వనరుల అభివృద్ధి

- **కలెక్టర్ పి. రంజిత్ బాషా**



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతతోనే మానవ వనరుల అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉల్లాస్ కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి కన్వర్జెన్స్ కమిటీ సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యతను రూపుమాపేందుకు చర్యలు చేపట్టనున్నామన్నారు. ప్రతి గ్రామంలో 50 ఏళ్లలోపు ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదవడం, రాయడం నేర్పించాలని సూచించారు. ప్రతి సచివాలయ ఉద్యోగి సామాజిక బాధ్యతతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఐదు నుంచి పది మంది నిరక్షరాస్యులను ఎంపిక చేసుకుని చదువు చెప్పేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. తరగతుల నిర్వహణకు అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. అక్షరాస్యతా తరగతులు సక్రమంగా నిర్వహించేలా పంచాయితీ సెక్రటరీలు, ఈవోపీఆర్డీలు, ఎంపీడీవోలు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, వయోజన విద్యాశాఖ డీడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఈవో శామ్యూల్, డీపీవో భాస్కర్, సమాచార శాఖ ఉప సంచాలకులు జయమ్మ, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ పాల్గొన్నారు.

జయహో..నారసింహా

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నరసింహస్వామి క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న అహోబిలం నరసింహ స్వామి పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం సేవను నిర్వహించారు. ద్వారాతోరణం, మండల, కుంభ, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఎదురుగా హోమ మండపాన్ని ఏర్పాటు చేసి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులను విశేషంగా అలంకరించి తిరువీధుల్లో కన్నులపండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్‌లు పర్యవేక్షించారు.

వాల్మీకిని స్మరించుకున్న పోలీసులు


వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


నంద్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం నివాళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి గొప్ప మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మహాకావ్యాన్ని రచించి సమాజానికి అందించాడని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ మంజునాథ్, నాగభూషణం, కార్యాలయ సిబ్బంది పాల్గొని వాల్మీకి మహర్షికి నివాళి ప్రకటించారు.

వీడని వర్షం


బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద నీరు


రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నె సమీపంలో నీట మునిగిన జొన్న పంట

చాగలమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 26.2 మీ.మీ. వర్షపాతం నమోదైంది. బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె, వక్కిలేరు వంతెనలపై వరద ఉధృతి తగ్గలేదు. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించిపోయాయి. చాగలమర్రి సమీపంలోని అడ్డవాగు పొంగి ప్రవహించి పంటలు నీట మునిగాయి. నగల్లపాడు, డి.వనిపెంట గ్రామాల్లో పిడుగు పాటుకు చెట్లు విరిగి పడ్డాయి. నగల్లపాడు సమీపంలోని దర్గా వద్ద పిడుగు పడటంతో చెట్టు చీలి గండి పడింది. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి మొలకలు రావడంతో కౌలు రైతులు భారీగా నష్టపోయారు. చాగలమర్రి, తోడెండ్లపల్లె, మల్లేవేముల గ్రామాల్లో ఎనిమిది మట్టిమిద్దెలు కూలాయి. గృహాల్లో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. ఆస్తి నష్టం సంభవించింది. మట్టి మిద్దెలు, పంట నష్టం అంచనా వేసి పరిహారం అందించాలని బాధిత కుటుంబీకులు, రైతులు కోరుతున్నారు. చాగలమర్రిలోని నాగులకట్ట వీధికి చెందిన జింక ఉసేన్‌వలి మట్టి మిద్దె కూలింది.


నీట మునిగిన పొగాకు పంట

రుద్రవరం : రుద్రవరం మండలంలో ఐదు రోజులుగా కురుస్తున్న తుఫానుకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం మండలంలోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు గ్రామాల వద్ద వక్కిలేరు వాగు పొంగి ప్రవహించింది. పేరూరు గ్రామ సమీపంలో ఇదే పరిస్థితి నెలకొంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎర్రగుడిదిన్న, మాకినేనిపల్లె, ఆలమూరు, తిప్పారెడ్డిపల్లె, ఇంకా పలు గ్రామాల్లోని పంట పొలాల్లో వర్షం నీరు నిల్వచేరి పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తుఫాను వర్షం ధాటికి మొక్కజొన్న రైతులు కుదేలయ్యారు. వేలాది క్వింటాల్లో మొక్కజొన్నలు దెబ్బతిన్నాయి. ఆలమూరులో 700 క్వింటాళ్ల ఎండుమిర్చి తడిసిపోయి దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పగిడ్యాలలో 40. 6 మి.మీ. వర్షపాతం నమోదు

పగిడ్యాల: అల్పపీడన ప్రభావంతో మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున వర్షం కురిసింది. వర్షానికి పంట పొలాలల్లో వర్షం నీరు నిలబడింది. ఆయా గ్రామాల్లో ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పట్టాలను కప్పి ఉంచారు. మండలంలో 40.6 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.


చాగలమర్రిలో మల్లె తోటలో నిలిచిన వర్షపు నీరు


డి. వనిపెంటలో పిడుగుపాటుకు నేలకొరిగిన వందేళ్ల చింతచెట్టు



ఓర్వకల్లులో జ్యోతులతో కళాకారులు

వైభవంగా చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలు

ఓర్వకల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన చౌడేశ్వరి దేవి జ్యోతుల ఉత్సవాలు గురువారం తెల్లవారుజామున అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను తొగట వీరక్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. అర్చకులు రామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. నందికోల సేవ, ఖడ్గ సేవ, చెక్క భజన వంటి సాంప్రదాయ నృత్యాలు, కీలుగుర్రం, గొరవయ్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 25 జ్యోతులతో కళాకారులు నృత్యాలు చేస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో గోవిందరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, రంగనాథగౌడు, కురువ పెద్దయ్య, గ్రామ ప్రజలు పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



చౌడేశ్వరి దేవి



కత్తి సేవ చేస్తున్న తొగట వీర క్షత్రియ సంఘం సభ్యులు

ఖమ్మం వాసులపై కేసు నమోదు

కర్నూలు క్రైమ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని ఖమ్మం జిల్లాకు చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునీత, మరికొంత మందిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన వెంకన్న అనే మసాల దినుసుల వ్యాపారి రూ.26.31 లక్షలు వసూలు చేసినట్లుగా బాధితుడు ఫిర్యాదు చేశారు. బాధితుడు వెంకన్న మసాల దినుసుల వ్యాపారం చేస్తుంటాడు. ఖమ్మం జిల్లాకు చెందిన మనోహర్, విజయలక్ష్మి, సురేష్, వేణు, సునీతలను సబ్ డీలర్లుగా నియమించుకున్నాడు. మసాల దినుసులు కొనుగోలు చేసిన తర్వాత నగదును చలానా రూపంలో పేమెంట్ చేశామని నకిలీ చలానాలు పంపారు. ఆ చలానాలు నమ్మిన వెంకన్న వారికి మసాల దినుసులు పంపారు. తర్వాత ఆలస్యంగా అకౌంటులో చూసుకుంటే నగదు జమ కాకపోవడంతో మోసపోయానని గుర్తించి ఈ నెల 7వ తేదీన ఎస్పీని ఆశ్రయించాడు. ఎస్పీ ఆదేశాల మేరకు కేసు విచారించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోరుగడ్డ అనిల్‌పై కర్నూలులో కేసు

కర్నూలు క్రైమ్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుడు బోరుగడ్డ అనిల్‌పై కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కూడా కేసు ఉంది. ఈ ఏడాది జూలై 12న టీడీపీ నాయకులు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం బోరుగడ్డ అనిల్‌ను రాజమండ్రి పోలీసులు అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్రీటౌన్ పోలీసులు కూడా ఆయన్ను కర్నూలుకు తీసుకువచ్చి విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



కీర్తి (ఫైల్)

నంద్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారి వెంకటేశ్వరపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కీర్తి (21) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందింది. నంద్యాల ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. వెలుగోడు మండల కేంద్రానికి చెందిన కీర్తి శాంతిరామ్ ఫార్మసీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పాణ్యంలో ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు గురువారం తన సోదరుడితో కలిసి వెలుగోడు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. నంద్యాల మండల శివారులోని శాంతిరామ్ మెడికల్ కళాశాల వద్ద ఉన్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో వీరి ద్విచక్ర వాహనాన్ని నంద్యాల నుంచి బనగానపల్లెకు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో కీర్తి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సోదరుడికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం నిల్వలు ఫుల్

- బారులు తీరిన లైసెన్స్‌దారులు
- మూడు రోజుల్లో రూ.13.32 కోట్ల వ్యాపారం
- ఇంకా తెరుచుకోని 19 షాపులు
- నాయకుల నుంచి తప్పని బెదిరింపులు
- బెల్టు షాపుల కోసం పోటా పోటీ



డిపోలో నిల్వ ఉంచిన మద్యం

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం 99 మద్యం దుకాణాలకు లైసెన్సులను లాటరీ ద్వారా మంజూరు చేసింది. లైసెన్సు దక్కించుకున్న వారందరూ బుధవారం నుంచి దుకాణాలను ప్రారంభించారు. తమకు అవసరమైన సరుకును నిర్దేశిత ఐఎంఎల్ డిపో నుంచి మంగళవారం నుంచే తీసుకెళ్తున్నారు. దుకాణాల నుంచి వచ్చిన ఇండెంట్ల ఆధారంగా కర్నూలు నగరంలోని ఐఎంఎల్ డిపో నుంచి మూడు రోజుల్లో సుమారు రూ.13.32 కోట్ల విలువైన మద్యాన్ని వ్యాపారులు తీసుకెళ్లారని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. పూర్తి స్థాయిలో ప్రైవేట్ మద్యం దుకాణాలు అందుబాటులోకి వస్తే ప్రభుత్వ ఖజానాకు కోట్లలో ఆదాయం సమకూరుతుంది. గత ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జే బ్రాండ్లకు బై..బై చెబుతూ గతంలో ఆదరణ పొందిన ప్రముఖ బ్రాండ్ల బాజా మోగింది. జిల్లా వ్యాప్తంగా 19 మద్యం దుకాణాలు తెరుచుకోలేదు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు షాపులు దొరకక ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఉన్నారు. క్వార్టర్ బాటిల్ రూ. 99కే విక్రయిస్తామని ప్రకటించిన మేరకు కాకుండా క్వార్టర్ రూ. 150 పైబడి ఉన్న మద్యంనే దుకాణాల్లో అమ్మకాలు సాగిస్తున్నారని పలువురు మందుబాబులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రముఖ బ్రాండ్లు ఐబీ, ఆర్సీ, రాయల్ స్టాగ్, బ్లెండర్స్ ప్రైడ్, కేఎఫ్‌లతో పాటు అన్ని కంపెనీల మద్యం అందుబాటులో ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



డిపో నుంచి వాహనాల్లో తరలిస్తున్న మద్యం

● లైసెన్స్‌దారులకు బెదిరింపులు..

మద్యం దుకాణాల లైసెన్సు పొందిన వారు ఇంకా ప్రారంభించుకోలేని పరిస్థితులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 19 మద్యం షాపులు తెరుచుకోవడానికి ముందుకు రావడం లేదు. ఆయా ప్రాంతాల్లో షాపులు తెరుచుకునేందుకు వారికి అద్దె గదులు దొరక్కుండా చేయగామరి కొన్ని చోట్ల తమకు వాటా ఇస్తేనే దుకాణాలు తెరుచుకోవాలని కింది స్థాయి నాయకులు పెద్ద నేతల పేర్లు చెబుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని లైసెన్స్‌దారులు ఎక్సైజ్ శాఖాధికారుల వద్ద తమ గోడు వెళ్ల బోసుకుంటున్నారు. కొత్త మద్యం షాపులు తెరుచుకునేందుకు సమయం కావాలని వేడుకుంటున్నట్లు సమాచారం.

● బెల్టు షాపుల కోసం ఊరూరా పోటీ..

జిల్లాలో బెల్టు షాపుల కోసం పోటీ పడే వారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే గ్రామాలు, పట్టణాల్లో మద్యం షాపులను దక్కించుకున్న వారి చుట్టూ పలువురు ప్రదక్షిణలు చేస్తున్నారు. మద్యం షాపు కోసం దరఖాస్తు చేసుకుని లక్షలు పోగొట్టుకున్న వారు బెల్టు షాపులు తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మద్యం దుకాణాల లైసెన్సుల కోసం ధరఖాస్తు చేసుకున్న వారిలో అధిక శాతం మందికి నిరాశే మిగిలింది, ప్రతి దుకాణానికి దాదాపు 50 వరకు ధరఖాస్తులు పడగా ఒక్కరికే షాప్ దక్కింది. మిగిలిన 49 మంది నిరాశే మిగిలింది. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు ప్రాంతాల్లో ఓ కూటమి నాయకులు దరఖాస్తు చేసుకోగా కనీసం ఒక్క షాప్ కూడా దక్కలేదు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న కొందరు సిండికేట్‌గా ఏర్పడి పదుల సంఖ్యలో టెండర్లు వేస్తే వారికి మొండి చెయ్యి మిగిలింది. సర్వత్రా మద్యం షాపుల జోలికి వెళ్లి చేతులు కాల్చుకున్నామనే నిరాశ కనిపిస్తోంది. వాటిని అధిగమించేందుకు బెల్ట్‌షాపుల కోసం ఆరాట పడుతున్నారు. లైసెన్స్‌ను మద్యం షాపుల యజమానుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరి కొందరు రాజకీయ నాయకుల సిఫారసు చేయిస్తున్నారు ఈ మేరకు తమ మద్దతుదారులకే వీటిని ఇప్పించాలని కూటమి నాయకులు ఉత్సాహం చూపిస్తున్నారు.

నాణ్యంగా పనులు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఈ వి.రామచంద్రారెడ్డి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం జడ్పీ ఆవరణలోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదోని డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రోడ్ల నిర్మాణాల పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 418 పనులకు రూ.29.42 కోట్లు మంజూరయ్యాయని అన్నారు. అంతే కాకుండా 25 అప్రోచ్ పనులకు రూ.15.50 కోట్లు అవసరమని, అందులో 11 పనులకు రూ.5.59 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అంచనాలు సిద్ధం చేశామన్నారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆదోని ఈఈ డీసీ వెంకటేష్, డీఈఈలు రాణి, మనోహర్ రెడ్డి, రంగస్వామి, చంద్రశేఖర్, ఏఈఈలు పాల్గొన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శప్రాయం

● రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారెడ్డి



వాల్మీకి జయంతి వేడుకల్లో ధర్మ సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయమని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి జాతికి సన్మార్గాన్ని చూపిన మహనీయుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘవేంద్ర, పట్టణ టీడీపీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, ప్యాపిలి మండల టీడీపీ అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య, ఎర్రిస్వామి గౌడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాధితురాలికి బంగారు నగలు అందజేత

నంద్యాల క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న బంగారు నగలు బాధితురాలికి గంటల వ్యవధిలో నంద్యాల పోలీసులు అందజేశారు. నంద్యాల మండలం రైతునగరం గ్రామానికి చెందిన శైలజ హైదరాబాద్ నుంచి నెల్లూరుకు బయల్దేరిన ఏఆర్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణించింది. రైతునగరం వద్ద దిగే సమయంలో ఆరు తులాల బంగారు ఆభరణాలు గల తన బ్యాగ్‌ను మరిచిపోయింది. ఆ తరువాత నంద్యాల త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించడంతో సీఐ సూర్యమౌళి విచారణ చేపట్టి పోగొట్టుకున్న బ్యాగును 24 గంటల్లోపల బాధితురాలికి అందజేశారు.

సజ్జల డ్రామాలు ఆపాలి : సోమిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సజ్జల ఇక డ్రామాలు ఆపాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో వైసీపీ అరాచక పాలన సాగించిందని అన్నారు. జగన్, సజ్జల, వైవీ. విజయసాయిరెడ్డిల అరాచకాలు, అక్రమాలు, వేధింపులు, దోపిడీలు అన్నీఇన్నీ కావని విమర్శించారు. సజ్జల విచారణకు హాజరు కావాల్సిందిగా పోలీసులు నోటీసులు జారీ చేశారని, అది తెలుసుకుని మీడియాను తప్పుబడుతూ సజ్జల కొత్త నాటకాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమౌతున్నాడన్నారు. నాడు జగన్‌కు తప్పుడు సలహాలు ఇస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, ప్రజాధనాన్ని కొల్లగొట్టారని ధ్వజమెత్తారు. ఇసుక, మద్యం, గంజాయి, మైనింగ్ వంటి మాఫియాల ద్వారా ప్రజల ధనాన్ని సమూలంగా దోచేయడం ద్వారా కోట్లు గడించిన సజ్జల పాపం పండిందన్నారు.

ఢిల్లీలో ఎంపీ బస్తిపాటి బిజీ



కేంద్ర మంత్రులను కలిసిన ఎంపీ బస్తిపాటి

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీ బస్తిపాటి నాగ రాజు ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేశారు. గురువారం ఢిల్లీలోని కన్స్యూమర్స్ ఫోరం, ఫుడ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అనంత రం కేంద్ర మంత్రులను కలిసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. మొదటగా కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్ సుఖ్ మండవియాను కలిసి కర్నూలు స్టేడియంలో నెలకొన్న సమస్యలను వినతి పత్రం ద్వారా సమర్పించారు. ఆ తరువాత కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసి కర్నూలు, విజయవాడ మధ్య విమా నం నడిపే చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర వినియోగదారులు, వ్యవహా రాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జ్యోషితో పాటు, కేంద్ర హోం వ్యవహారాల శాఖ మంత్రి బండిసంజయ్ ని కలిసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరారు. సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేసేందుకు కేంద్ర మంత్రులు సహకరించాలని కోరినట్లు తెలిపారు.

వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయండి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్లకు వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ పల్లె పండుగలో శంకుస్థాపన చేసిన 1026 సీసీ రోడ్లకు వర్క్‌ఐడీ వారీగా వెండర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈనెల 20వ తేదీలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో వేగాన్ని పెంచి నిర్దేశించిన లక్ష్యాల్ని పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో పట్టణ ప్రాంతాలలోని 850 గృహ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రూ.1.94 కోట్లు, అలాగే గ్రామీణ ప్రాంతాలలో పూర్తిచేసుకున్న 80 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షలు జమ అయినట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ జనార్దన్‌రావు, హౌసింగ్ ఈఈ హరిహరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన డోన్ న్యాయవాది

● అక్రమంగా కేసులు పెట్టాడని సీఐపై ఫిర్యాదు

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో డోన్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్ హోంమంత్రి అనితను గురువారం కలిసి అక్రమంగా న్యాయవాదులపై కేసులు పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా తనపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీడీపీ డోన్ మండల అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాసులు యాదవ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి విచక్షణారహితంగా కొట్టారని ఫిర్యాదు చేసినట్లు న్యాయవాది కృష్ణ ప్రసాద్ తెలిపారు.



హోంమంత్రి అనితను కలిసిన న్యాయవాది కృష్ణప్రసాద్

సీఐ దాడిపై టీడీపీ సీరియస్

- శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- ఘటనపై ఆరా తీసిన సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్

డోన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాసులు యాదవ్‌పై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేసిన వ్యవహారంపై రాష్ట్ర పార్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. ఆ మేరకు శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించి భరోసా కల్పించి రావాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్ ఆదేశించారు. దీంతో గురువారం మండలంలోని వెంకటనాయుని పల్లెకు వెళ్లి పోలీసుల దాడిలో గాయపడిన శ్రీనివాసులు యాదవ్‌ను టీడీపీ నాయకుల బృందం పరామర్శించింది. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజా వైద్యశాల మల్లికార్జున, మాజీ ఎంపీపీ ఆర్ఈ రాఘ వేంద్ర, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య తదితరులతో కలిసి టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ బృందం శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శించింది. పోలీసులు దాడి ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ప్యాపిలి మండల పార్టీ అధ్యక్షులు రామసుబ్బయ్యతో పాటు పలువురు నాయకులు డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ దారుణంగా అవమానించి దాడి చేసి గాయపరిచారని జిల్లా పార్టీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ముందు గోడు మొర పెట్టుకున్నారు. సీఐను సస్పెండ్ చేయక పోతే పార్టీ పదవులకు రాజీనామా చేస్తామని తేల్చి చెప్పారు. తొందరపడి ఎవరూ ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని మల్లెల రాజశేఖర్ భరోసా ఇచ్చారు. పోలీసు అధికారి ఎందుకు అలా దాడి చేశారన్న విషయంపై విచారించి నివేదిక ఇవ్వా లని పార్టీ అధిష్టానం కోరిందని తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి దాడి వ్యవహారాన్ని తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్ తన దగ్గరకు తీసుకు రావాలని ఆదేశించారని, మీ సమస్యను నేరుగా ఆయన ముందు చెప్పుకోవాలని మల్లెల రాజశేఖర్ సూచించారు. తప్పనిసరిగా పార్టీ అధిష్టానం న్యాయం చేస్తుందని, ఇందులో ఎలాంటి అపోహలు వద్దని మండలాల పార్టీ అధ్యక్షులకు భరోసా ఇచ్చారు. మొత్తానికి పోలీసులు టీడీపీ నేతపై దాడి వ్యవహారం ఆర్టీ అధిష్టానం సీరియస్‌గా తీసుకోవడంతో ఏం జరుగుతుందోనన్నది సర్వత్రా చర్చగా మారింది. పరామర్శించిన వారిలో నాయకులు ఆలా మల్లికార్జునరెడ్డి, మల్లెంపల్లి జయన్న యాదవ్, సర్పంచ్ రామిరెడ్డి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మిద్దెపల్లి గోవిందు ఉన్నారు.



శ్రీనివాసులు యాదవ్‌ను పరామర్శిస్తున్న మల్లెల రాజశేఖర్, సుబ్బారెడ్డి తదితరులు

ఈవో అవినీతిపై విచారణ జరిపించాలి



డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 17,(ఆంధ్రజ్యోతి): కాల్వ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానం ఈవో ప్రసాద్ అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జగన్నాథం డిమాండ్ చేశారు. గురువా రం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఈవో రూ.1.30 కోట్ల దేవుని సొమ్ము స్వాహా చేయాలనే ఉద్దేశంతో సొంత అకౌంట్‌లోకి మళ్లించుకున్నాడనే ఆరోపణలపై విచారణ జరిగిన అంశాలు బహిర్గతం చేయక పోవడంపై పలు అనుమానాలు ఉన్నాయని, వాటిని బహిర్గతం చేసి అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకులోకి వర్షం నీరు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళా ఖాతంలో అల్పపీడనం ప్రభావంతో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కర్నూలు జీజీహెచ్‌లోని బ్లడ్ బ్యాంకులోకి వర్షపునీరు చేరింది. న్యూడయోగ్నస్టిక్ బ్లాకులోని నాలుగో అంతస్తు నుంచి చెట్లపై నుంచి వర్షం నీరు రెండో అంతస్తులో ఉన్న బ్లడ్ బ్యాంకులో చేరాయి. గురువారం ఉదయం వర్షం నీరు బ్లడ్ బ్యాంకుకు చేరుకోవడంతో రక్తం కోసం వచ్చే రోగులు అవస్థలు పడ్డారు. దీంతో సేవలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రభాకర్ రెడ్డి నాల్గవ అంతస్థులో వర్షం నీరు కిందకు రాకుండా మెట్లకు అడ్డంగా గోడ కట్టించి సమస్యను పరిష్కరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పారిశుధ్య కార్మికులు బ్లడ్ బ్యాంకులో ఉన్న వర్షం నీరుని తొలగించే పనిల్లో నిమగ్నమయ్యారు.

'చదువుకుంటాం.. అవకాశం కల్పించండి'

కర్నూలు అర్బన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): చదువుకుంటాం.. అవకాశం కల్పించాలని పీజీ సెట్ రాయని విద్యార్థులు డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నరసింహులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు రామక్రిష్ణ, నాగరాజు మాట్లాడుతూ గత ఏడాది పీజీ సెట్ రాయని విద్యార్థులు పీజీ చదివే అవకాశం కల్పించాలని కోరారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. గురువారం భాగ్యనగర్ 30వ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. సెలవుల నమోదు, హాజరు పట్టికను పరిశీలించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌ఓ జునైద్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఐ రాజు ఉన్నారు.

ప్రధాన చెరువుకు జలకళ

ఓర్వకల్లు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజు లపల్లె గ్రామంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి నీటితో కళకళలాడుతోంది. 2004లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్, నాటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ఆ గ్రామానికి వచ్చారు. గ్రామ సమీపంలో చెరువు నిర్మిస్తే 350 ఎకరాలకు సాగునీరు అందుతుందని గ్రామస్థులు ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.10లక్షల నిధులు నాడు మంజూరు చేశారు. అయితే ఈ చెరువు గత ఐదేళ్లుగా చెరువులో చుక్కనీరు లేక రైతులు ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆ చెరువు నీటితో కళకళలాడుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి





వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరికి పూలమాల వేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు, ఉర్దూ యూనివర్సిటీలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ అధ్యాపకులు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గురువారం జడ్పీ మినీ సమావేశ భవనంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారులు సరస్వతమ్మ, బసవశేఖర్, జితేంద్ర, పుల్లయ్య, నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

● వాల్మీకి జయంతిని పురస్కరించుకుని నగర మేయర్ బీవై రామయ్య గౌరీగోపాల్ సమీపంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ, వాల్మీకి నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: భారత జాతికి రామాయణ మహా గ్రంథాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పి. హనుమంతరావు చౌదరి కొనియాడారు. గురువారం వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని నగరంలోని కిసాన్ ఘాట్ సమీపంలోని ఆయన విగ్రహానికి జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ప్రతినిధులు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈసందర్భంగా చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించుకోవడానికి ఉత్తర్వులు జారీ చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో కళాకారులు షఫీయుల్లా, పుల్లయ్య, కళాప్రియ తిరుపాలు పాల్గొన్నారు.

● **వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..** వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి అన్నారు. గురువారం కిసాన్ ఘాట్ సమీపంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు గోరంట్ల రమణ, మహేష్, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, సాయిరామ్ పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కర్నూలు మెడికల్ కాలేజీలో వాల్మీకి మహర్షి జయంతిని గురువారం ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ హరిచరణ్, సాయిసుధీర్, రేణుకాదేవి, విజయానందబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఏవో లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్: వాల్మీకి జయంతి సందర్భంగా శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం బళ్లారి చౌరస్తా నుంచి గౌరి గోపాల్ వరకు వాల్మీకి మహర్షి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో హోంగార్డ్స్ రాయలసీమ రేంజ్ ఎస్పీ మేకల మహేష్, పీపీ స్వాములు, కుంపటి కృష్ణయ్య, కట్టెల రామాంజనేయులు, ఎస్ఎల్‌వీ రామకృష్ణ వాల్మీకి నాయుడు, అశోక్, కొంతలపాడు రామాంజి, చింతమాను రాజు, డా.రమేష్, హరి కొంకాల కృష్ణ, ఉపేంద్ర, హరి, ఆర్టీసీ రమణ, మక్కినేని రాజు, అడ్వకేట్ గోపాలకృష్ణ, కౌలుట్ల, రేమట లక్ష్మీదేవి, సంజీవలక్ష్మి, పద్మావతి, నాగేశ్వరి, నాయుడు, ఆర్‌కే శ్రీనివా సులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: రాయలసీమ యూనివర్సిటీలో వాల్మీకి చిత్రపటానికి ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి పూలమాలలు వేశారు. వీసీ కాన్ఫరెన్సు హాలులో జరిగిన కార్యక్రమానికి డీన్ఆఫ్ అకడమిక్ డైరెక్టర్ ఆర్ భరత్ కుమార్, సమన్వయ కర్త పి.శ్రీనివాసులు, వివిధ విభాగాల ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో రిజిస్ట్రార్, ప్రొఫెసర్ లోక్‌నాథ్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మహబూబ్ బాషా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, వెంకటప్ప, పాల్ కృపాకర్ పాల్గొన్నారు.

● నగరంలోని గౌరిగోపాల్ సెంటర్ వద్ద వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బీసీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవ పూజ ధనుంజయ్ ఆచారి, యాదవ హక్కుల పోరాట సమితి పోరాట రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న యాదవ్ పాల్గొన్నారు.

కర్నూలు స్పోర్ట్స్: నగరంలోని క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. సాయ్ హాస్టల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కోచ్‌లు యూసుఫ్, రవికుమార్, కాశీనాథ్, శేషఫణి, ఇర్ఫాన్, సుంకారావు, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక పెద్ద బోయగేరి వీధిలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే, కోట్ల హర్ష వాల్మీకి మహర్షి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. టీడీపీ కేఈ మల్లికార్జునగౌడ్, బలరాం, కౌలుట్ల వైసీపీ నాయకులు జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగన్న, లింగమయ్య పాల్గొన్నారు.

● మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, వైసీపీ నాయకులు లాయర్ ప్రభాకర్, సీపీఎం నాయకులు గఫూర్ మియా, వీరన్న, టీడీపీ సీనియర్ నాయ కులు హనుమంతప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్ వాల్మీకి ఆలయంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, బాలజి వెంకటేష్, కొత్తకోట హరి పూజలు చేశారు. వాల్మీకి జయంతిని పుస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ రామాయణం రచించిన వాల్మీకి మహర్షి అడుజాడలలో నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో గోవిందు, డిస్ వెంకటేశ్ పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి, అనుగొండ, అమడగుంట్ల తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పులకుర్తిలోని వాల్మీకి ఆలయంలో పంచామృతాభిషేకం, పుష్పార్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం వాల్మీకి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామంలో ఊరే గించారు. అనుగొండలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేసి శోభాయాత్ర చేపట్టారు. అమడగుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. మహర్షి జీవిత విశేషాలపై హెచ్‌ఎం అనంతయ్య విద్యార్థులకు సందేశం వినిపించారు.

గూడూరు: గూడూరులో వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గూడూరులలోని వాల్మీకి ఆలయంలో స్వామి వారికి వాల్మీకులు పూజలు చేశారు. వాల్మీకి ఆలయంతో పాటు ఆయా కాలనీల్లో విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. స్వామి వారి ఊరేగింపు వైభవంగా సాగింది. కార్యక్రమంలో వాల్మీకి సంఘం పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని కన్నమడకల, పూడిచెర్ల, లొద్దిపల్లె, నన్నూరు, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, హుశేనాపురం, సోమయాజు లపల్లె, శకునాల తదితర గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశా లల్లో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. హుశేనాపురంలో నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, వడ్డె రాముడు, మనోహర్, రమేష్, వేణుగో పాల్, హరిబాబు, మధు పాల్గొన్నారు.





వాల్మీకి మహర్షి శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు, వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు, హుశేనాపురంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న మల్లెల రాజశేఖర్

శ్రీకృష్ణదేవరాయల వర్ధంతి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని గురువారం నిర్వహించారు. నగరంలోని ఐదురోడ్ల సర్కిల్ హెచ్‌డీటీసీ కాంప్లెక్స్‌లోగల నగర బలిజ సంఘం కార్యాలయంలో శ్రీకృష్ణదేవరా యలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. మండ్లెం రవి రాయల్, కె శైలేష్ రాయల్, టి.ఈశ్వర్ కుమార్ రాయల్, ప్రభాకర్‌రెడ్డి, అనిమిరెడ్డి, అజయ్, సుభాష్, శివారెడ్డి పాల్గొన్నారు.

20న సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్, యూట్యూబ్ కళాకారిణి, విజయనగరం జిల్లావాసి మంగాదేవి కర్నూలులో 'సత్య హరిశ్చంద్ర' నాటకం ప్రదర్శిస్తున్నారు. ఈనెల 20న సాయంత్రం 6.30 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో ఈ నాటక ప్రదర్శన ఉంటుందని కళా క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాటకంలోని ఇతర పాత్రల్లో ప్రముఖ రంగస్థల నటులు చీమకుర్తి ఆంజనేయులు నక్షత్రకునిగా, వనజకుమారి చంద్రమతిగా, కర్నూలుకు చెందిన కళాకారులు పి. రాజారత్నం, సంగా ఆంజనేయులు, వెంకటేశ్వర్లు వివిధ పాత్రల్లో నటించనున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా రాజవర్ధన్‌రెడ్డి జయంతి

కోడుమూరు, అక్టోబరు 17: టీడీపీ సీనియర్ నాయకుడు డి.విష్ణువర్ధన్‌రెడ్డి తనయుడు రాజవర్ధన్‌రెడ్డి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దస్తగిరి పాల్గొన్నారు. రాజవర్ధన్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవల గురించి కొనియాడారు. అనం తరం అన్నదాన కార్యక్రమాని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేఈ మల్లికార్జునగౌడ్, గంగాధర్ నాయుడు, బడెసా, గౌడ్, బాలకృష్ణ, మధు, లక్ష్మన్న, బ్రిటీష్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్ల పంపిణీ: మండలంలోని ప్యాలకుర్తి గ్రామం టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో గురువారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రాజవర్ధన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని టీడీపీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి, ప్యాలకుర్తి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు షేక్షావలి, ఉస్సేన్, దేవరాజ్, మాదన్నలు కోడుమూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్లు, చీరల పంపిణీ

కర్నూలు రూరల్: టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్దన్ రెడ్డి కుమారుడు డి.రాజావర్దన్ రెడ్డి జయంతి సందర్భంగా కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో పసుపుల గ్రామ సర్పంచ్ బొగ్గుల శీలమ్మ గురువా రం అక్షిత భవన్‌లో దివ్యాంగులకు పండ్లు, చీరలు పంపిణీ చేశారు. రాజావర్దన్ రెడ్డి జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాజా వర్దన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పసుపుల గ్రామ మహిళలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో కర్నూలు మాజీ ఎంపీపీ రాజవర్ధన్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టీడీపీ నాయకులు హాజరై రాజవర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజావర్ధన్ రెడ్డి చిన్న వయసులోనే మంచి నాయకుడిగా పేరుపొందారని, ఆయన మన మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగన్నగౌడు, బాలాజి వెంకటేశ్, బీమన్న, గౌస్, శంకర్, దనుంజయుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గూడూరు: రాజవర్దన్ రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని టీడీపీ సీనియర్ నాయకుడు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. గురువారం గూడూరులోని పాత బస్టాండ్‌లో రాజవర్ధన్‌రెడ్డి జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్ నాయుడు, టీడీపీ నాయకులు సృజన్, పౌలు, తెలుగు శ్రీనివాసులు, విజయ్, కౌన్సిలర్ బుడ్డంగలి, చెంచుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కోడుమూరులో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శీలమ్మ



గూడూరు: నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

గ్రామాల అభివృద్ధే టీడీపీ లక్ష్యం: ఎమ్మెల్యే

సి.బెళగల్, అక్టోబరు 17: గ్రామాల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.30 లక్షలు, గొల్లల దొడ్డిలో రూ.10 లక్షలు, బురాన్‌దొడ్డిలో రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ సి.బెళగల్ మండలానికి ప్రభుత్వం మొదటి దశలో రూ2.కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి సర్పంచ్‌లు రామంజినేయులు, రామలింగమ్మ, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మాజీ మండల కన్వీనర్ పాండురంగన్న గౌడు, మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు, బాలాజి వెంకటేశ్, బీమన్న, శీలం వెంకటేశ్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు ఉగాది వెంకటేశ్వర్లు, రఘుపతి, మధు అన్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తూరు, ప్యాలకుర్తి, ముడుమలగుర్తి గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కొత్తూరులో రూ. 6లక్షలు, ప్యాలకుర్తిలో రూ. 19. 60 లక్షలు, ముడుమలగుర్తిలో రూ. 10లక్షలతో సీసీ రహదారులు, డ్రైనేజీ కాలువలు నిర్మించనున్నట్లు ఎంపీడీవో రాముడు, ఏఈ గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సువర్ణమ్మ, కమలాకర్, శ్రీనివాసులు, రమణ, రాము, ఆరీఫ్, ఉస్మాన్, తులసీరెడ్డి, తులసిరెడ్డి, సీతారాముడు, మల్లేష్, సాయి ఈశ్వరప్ప, గోకారి, అయ్యస్వామి, గిరి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని కాల్వ, భైరాపురం, ఉప్పలపాడు, గుడుంబాయి తాండ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల ఇంజనీర్ సురేంద్రనాథ్ రెడ్డి, ఏపీవో కుమార సాయినాథ్, ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, సర్పంచులు అయ్యస్వామి, వెంకటేశ్వర్లు, దీప్తిబాయి, ఎంపీటీసీలు సరోజమ్మ, నాయకులు ఖాదర్ బాషా, రజాక్ పాల్గొన్నారు.

కల్లూరు: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో పల్లెప్ర గతికి పెద్దపీట వేసిందని కల్లూరు ఈఓఆర్డీ నగేష్ అన్నారు. గురువారం కల్లూరు మండలం చిన్నటేకూరు, పెద్దటేకూరు, దొడ్డిపాడులో ఎన్ఆర్ ఈజీఎస్ కింద ఎంపికైన అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఫైనాన్స్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, పీఆర్ ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దీశ్వ రమ్మ, టీడీపీ నాయకుడు ఆంజనేయులు, మాజీ సర్పంచు లక్ష్మన్న, మాజీ ఎంపీటీసీ యాగంటయ్య, ఎంపీటీసీ మునిస్వామి, దొడ్డిపాడు బాషా పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో యువత పాత్ర కీలకం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎంతో కీలకమైందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ రవీంద్రబాబు అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. అసిస్టెంట్ ఎలక్షన్స్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్లు ధనుంజయ, శ్యామ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

22న జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

కోడుమూరురూరల్,(ఆంధ్రజ్యోతి) అక్టోబరు 17: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్, ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా, సన్ కిసాన్ అగ్రి అండ్‌కో కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ

కర్నూలు లీగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రభు త్వ పాఠశాలలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌తో కలిసి తనిఖీ చేశారు. స్థానిక పెద్దమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించారు. ఈ పథకం అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను వారు పరిశీలించి పాఠశాలలకు సంబంధించి న రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



పాఠశాలలో ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

విజేతకు కలెక్టర్ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): త్రివేండ్రంలో ఈ నెల 5వ తేదీ నుంచి 9 వరకు జరిగిన 53వ కేంద్రీయ విద్యాలయం స్పోర్ట్స్ మీట్‌లో ఆర్.దీవస్ కుమార్ 400 మీటర్ల పరుగులో, అలాగే 400 మీటర్ల హార్డిల్స్ బంగారు పతకం సాధించాడు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్ బాషా విజేతను అభినందించారు. నవంబరులో రాంచిలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, విద్యాలయ ప్రిన్సిపాల్ ప్రియాంక, కోచ్ హారిక పాల్గొన్నారు.



దీవస్‌కుమార్‌ను అభినందిస్తున్న కలెక్టర్

రీ సర్వే గ్రామాల్లో సభలు


శివరాముడు

ఆదోని రూరల్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నేటి నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆదోని తహసీల్దార్ శివరాముడు గురువారం నవంబరు 15 వరకు నిర్వహిస్తామని, నేడు నారాయణపురం గ్రామంలో ప్రారంభమవుతుందని, రైతులు, ప్రజలు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

భూసమస్యలను పరిష్కరిద్దాం

మద్దికెర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతుల భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరిద్దామని తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ అన్నారు. గురువారం వీఆర్వోలతో మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. గత ప్రభుత్వం రీసర్వే చేసిన గ్రామాల్లో ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రెవెన్యూ సభలు నిర్వహిస్తామన్నారు. 18న ఎం.అగ్రహారం, 19న బురుజుల, 22న హంప గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు. డీటీ శ్రీదేవి, వీఆర్వోలు రషీద్, శ్రీరాములు, శివన్న, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకోండి

ఆస్పరి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సభల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. రీ సర్వే పూర్తిచేసిన గ్రామాల్లో ఈనెల 18 నుంచి 29 వరకు నిర్వహిస్తామని అన్నారు.

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి


మణేకుర్తిలో భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

ఆలూరు రూరల్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఇన్‌చార్జి ఎంపీడీవో రమాదేవి, టీడీపీ రైతు కమిటీ తాలూకా అధ్యక్షుడు దేవేంద్రప్ప అన్నారు. మండలంలోని మణేకుర్తి, కమ్మరచేడు, మసనహళ్ళి గ్రామాల్లో గురువారం పల్లె పండుగలో సర్పంచులు కొల్లమ్మ, పార్వతి, సుమతి రెడ్డి అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఏపీవో శ్రీనివాసులు, ఏఈ చౌడరెడ్డి, ఈసీ మారన్న, జె వీరేష్, టీడీపీ నాయకులు డీలర్ వెంకటేశ్వర్లు, మహీధర్ రెడ్డి, సోమలింగ, అయ్యళ్ళి, రామేష్, దేవేద్ర, కార్యదర్శులు విజయకుమార్, జిలాన్ బాషా, భాస్కర్, హేమంత్, టీఏ శర్మాష్ వలి, నాగేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను మార్చాలి

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో శిథిలావస్థకు చేరుకున్న ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌ను మరో భవనంలోకి మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థులు హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారని భవనం శిథిలావస్థకు చేరడంతో భయంతో ఉంటున్నారన్నారు. శశిధర్, లోకేష్, గణేష్, యశ్వంత్, పతాప్, రాజు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తూ..

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు

ఆదోని, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని వాటితోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. గురువారం మండగిరి పంచాయతీలో పండుగలో భాగంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో పెండింగ్ పనులు, సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, కునిగిరి నీలకంఠ, కృష్ణమ్మ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు


పత్తికొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గతంలో రీసర్వే చేసిన గ్రామాల్లో నేటినుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. 18న దేవనబండ, 19న చక్కరాళ్ల, 22న పుచ్చకాయలమడ, 23న చిన్నహుల్తి, 24న పెద్దహుల్తి, 25న దూదేకొండ గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

బాధ్యతలు చేపట్టిన టీపీవో


టీపీవోను సన్మానిస్తున్న సర్వేయర్లు

ఆదోని టౌన్, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళిక అధికారి(టీపీవో)గా బాల మద్దయ్య గురువారం బాధ్యతలను చేపట్టారు. ఏళ్ల తరబడి టీపీవో పోస్టు ఖాళీగా ఉంది దీంతో ఏసీపీ మాత్రమే విధులను నిర్వహిస్తూ వచ్చారు. నందికొట్కూరు నుంచి బదిలీపై వచ్చిన బాల మద్దయ్య బాధ్యతలను చేపట్టంతో, పనుల వేగం పెరగడానికి అవకాశం ఏర్పడింది. ప్లానర్‌లు టీపీవోను కలిసి సన్మానించారు. చిన్న రంగ స్వామి, విజేంద్ర నాథ ప్రసాద్, ఆది, రఫిక్, సాబీర్, ఈరన్న, రమేష్, రవి పాల్గొన్నారు.

రైతు బేజార్



అడ్డుకుంటున్న వ్యాపారులు

రైతు బజార్ బయట దుకాణాలు ఉన్నాయి. రైతు బజార్ ప్రారంభిస్తే తమ వ్యాపారం దెబ్బతింటున్న ఆందోళనతో వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతు బజార్‌లో ప్రభుత్వం నిర్ణయించ ధరలకే అమ్మాల్సి రావడంతో తాము నష్టపోతామని వ్యాపారులు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు అంటున్నారు.

సహకరించడం లేదు



రూ 70లక్షల మార్కెటింగ్ శాఖ నిధులతో పత్తికొండలో రైతబజార్‌ను నిర్మించాం. దుకాణాల ఏర్పా టుకు సహకరించాలని గ్రామ పంచాయతీ, ఇతర అధికారులను కోరాం. ఎవరూ సహకరించడం లేదు దీంతో దుకాణాలను ఏర్పాటు చేయలేకపోయాం. **- కార్నలీస్, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి**

వ్యాపారులు దోచుకుంటున్నారు



కూరగాయలు కొనడానికి భయపడుతున్నాం. రైతు బజార్ లేకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తున్నారు. ఎంత చెబితే అంతకే కొనాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రైతుబజార్‌లో దుకాణాలను ఏర్పాటు చేయాలి. **- బారిక క్రిష్ణ, పత్తికొండ**

- పత్తికొండలో రైతుబజార్‌ను నిర్మించి వదిలేసిన అధికారులు
- నిరుపయోగంగా మారిన వైనం
- రైతులు, వినియోగదారుల ఇబ్బందులు

రైతు బజార్‌ను నిర్మించి ప్రారంభించారు. ఇంతకంటే ఇంకేం కావాలని పట్టణ ప్రజలు అనుకున్నారు. అయితే దుకాణాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతుబజారు నిరుపయోగమైంది. కూరగాయలను నేరుగా అమ్ముకునే అవకాశం లేక రైతులు దోపిడీకి గురవుతున్నారు. దుకాణాలు ఏర్పాటు కాకుండా వ్యాపారులు అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పత్తికొండ, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుమారు 40వేల వరకు మంది నివసిస్తున్నారు. పట్టణం చుట్టు పక్కల 16 పంచాయతీలు ఉన్నాయి. హంద్రీ కాలువ కింద పట్టణం చుట్టూ అధిక సంఖ్యలో కూరగాయలను సాగుచేస్తున్నారు.

రైతు బజార్ నిర్మించినా..

రైతు బజార్ ఆవశ్యకతను గుర్తించిన నాటి ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కేఈ క్రిష్ణమూర్తి రైతు బజార్ నిర్మాణానికి రూ70లక్షలు మంజూరు చేయించారు. సంతమార్కెట్ వద్ద పంచాయతీ స్థలంలో నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే ఎన్నికలు రావడంతో ప్రారంభించలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో రైతుబజార్‌ను ఎవరూ పట్టించుకోలేదు.

దోపిడీకి గురవుతున్న రైతులు

రైతు బజార్ లేకపోవడంతో తమ పంట ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే వీలు లేకుండా పోయింది. దీంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారులు ఎంత ఇస్తే అంతకు తెగనమ్ముకుని దోపిడీకి గురవుతున్నారు.

ప్రారంభించి వదిలేసి గత ఎమ్మెల్యే

పత్తికొండ అభివృద్ధి తమతోనే అంటూ గొప్పలు పోయిన నాటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీదేవి 2021లో రైతుబజార్ ప్రారంభించారు. దుకాణాల కేటాయింపు, కూరగాయల విషయమై మార్కెటింగ్ అధికారులతో మాట్లాడలేదు. దీంతో రైతుబజార్‌కు తాళం పడింది.

మూడేళ్లు దాటినా..

రైతు బజార్‌ను ప్రారంభించి మూడేళ్లయినా ఒక్క దుకాణం ఏర్పాటు కాలేదు. రైతులు, వినియోగదారుల సంక్షేమం కోసం కేఈ క్రిష్ణమూర్తి తనయుడు ప్రస్తుత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు స్పందించి రైతు బజార్‌ను ప్రారంభించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకి ఆదర్శప్రాయుడు


హాలహర్వి: నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

హొళగుంద, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి ఆదర్శప్రాయుడని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. గురువారం వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వం కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. కొతపేట, గజ్జెహళ్లి గ్రామంలో ఊరేగింపు నిర్వహించినట్లు గ్రామస్థులు శేఖర్, భీమేష్ తెలిపారు.

హాలహర్వి: వాల్మీకులను ఎస్టీలో చేర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. గురువారం విరుపాపురంలో వాల్మీకి జయంతిలో పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి వడ్డాణం


వడ్డాణం ఇస్తున్న దాతలు

వెల్దుర్తి, అక్టోబరు, ఆంధ్రజ్యోతి 17: రేణుకా ఎల్లమ్మకు వెల్దుర్తికి చెందిన మాజీ ఎంపీటీసీ అనకల సుజాత, భర్త రమేష్ దంపతులు 55 తులాల వెండి వడ్డాణాన్నిర సమర్పించారు. పూజారి రవివర్మకు బహూకరించి మొక్కును చెల్లించుకున్నారు.

ఎంపీడీవోగా సువర్ణలత


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీవో

పత్తికొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా సువర్ణలత గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును కలిశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తామని సువర్ణలత తెలిపారు.

సభ్యులకు శిక్షణ

మద్దికెర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఉప సర్పంచ్, సభ్యులకు ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో కొండయ్య, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి గురువారం తెలిపారు. తప్పకహాజరు కావాలన్నారు.

సంక్షేమమే ధ్యేయం

మద్దికెర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని సర్పంచ్ పద్మావతి, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, చెన్నకేశవులు, ఏపీవో నర్సిరెడ్డి, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి అన్నారు. గురువారం బురుజుల గ్రామంలో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్లకు పనులకు భూమి పూజ చేశారు. పల్లెలకు మహర్దశ వచ్చిందని, గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుందని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేక పోయారనీ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తన్నామన్నారు. టీడీపీ నాయకులు మోహన్, పుత్తూరు శ్రీనివాసులు, కార్యదర్శి వన్నూరప్ప, హరికృష్ణ, పంచాయితీరాజ్ ఏఈ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

'వీరభద్ర గౌడ్‌తోనే ఆలూరు అభివృద్ధి'

ఆస్పరి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి టీడీపీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తోనే సాధ్యమని మాజీ కన్వీనర్లు ఎస్ తిమ్మన్న, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఉచ్చీరప్ప, శ్రీనివాస్ గౌడ్, మండల కార్యదర్శి శేషాద్రి నాయుడు, సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ అన్నారు. గురువారం గాంధీ పార్కులో విలేకరుల సమావేశం నిర్వహించారు. వీరభద్ర గౌడ్, టీడీపీని కించపరుస్తూ జగన్ దినపత్రికలో వచ్చిన అమ్మకానికి ఫీల్డ్ అసిస్టెంట్ కథనంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి దోహదపడే తమ నాయకుడిపై అవాస్తవ కథనాలు రాయడం సిగ్గుచేటు అన్నారు. చిన్న హోతూర్ మధుసూదన్ చౌదరి, ఎంపీటీసీ రహితుల్లా, సతీష్ కుమార్, హరి, కర్ణాటక, కైరుప్పల వీరేష్, యుగంధర్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

ఆలూరు, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : రీ సర్వే పూర్తిఅయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహి స్తున్నట్లు తహసీల్దార్ గోవింద్ సింగ్ గురువారం తెలిపారు. 18న గోనేహాల్, 19న కాత్రికి, మూసనహళ్లి, 22న తుంబల బీడు, 23న మర కట్టు, 24నా కరిడి గుడ్డం, 25నా అంగస్కల్, 26నా కమ్మర చేడు, 29నా కురువల్లి, 30నా ముద్దనగేరిలో ఉంటాయన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


ఆదోని: కల్లుబావిలోని వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మీనాక్షినాయుడు


పత్తికొండ: వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

ఆదోని, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి) : రామాయణ మహా కావ్య సృష్టికర్త వాల్మీకి అని మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. కల్లుబావి కాలనీలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. కల్లుబావి మల్లికార్జున, బుద్ధారెడ్డి తిమ్మప్ప, మోహన్ బాబు గోపాల్ ఉన్నారు. ఆదోని మండలం పెదహ్యారివాణం గ్రామంలో టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు వాల్మీకి విగ్రహానికి నివాళులర్పించారు. బసవరాజు, శేషరెడ్డి ఉన్నారు. అలాగే సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. సర్వేయర్లు వేణు సూర్య, శ్రీనివాసరాజు, రామచంద్ర రావు పాల్గొన్నారు.

పట్టణంలోని పాఠశాలల్లో

ఆదోని అగ్రికల్చర్: మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లికార్జున మాట్లాడుతూ, వాల్మీకి రామాయణాన్ని రచించి భారతావనికి అందించిన మహనీయుడు అని కొనియాడారు. ఉపాధ్యాయులు ఫయాజ్, నరసయ్య, రవి నాగరాజు, సతీష్ పాల్గొన్నారు. ఆర్ఆర్ లేబర్ కాలనీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రమేష్ నాయుడు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మిల్టన్ పాఠశాలలో కరస్పాండెంట్ రమేష్ బాబు ప్రిన్సిపాల్ నాగరాజు, సీఈవో వెంకటేష్ నివాళి అర్పించారు. పెయింట్ అంథోని ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కేశవయ్య ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పురపాలక కార్యాలయంలో..

ఆదోని టౌన్: పురపాలక కార్యాలయంలో చైర్ పర్సన్ వాల్మీకి శాంత వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు. కమిషనర్ కృష్ణ, ఎంఈ ఇంతియాజ్ ఆలీ, డీఈ రామమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

- మండలాల్లో వాల్మీకి జయంతి

హాలహర్వి: టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ హాలహర్వి నిట్రవట్టి గ్రామాల్లో నివళి అర్పించాచరు.

పత్తికొండ: టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు నివాళి అర్పించారు. పాతపేట వాల్మీకి అలయంలో కేడీసీసీ మాజీ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి, పంచాయితీ గౌరవ సలహాదారులు నాగరత్నమ్మ, సర్పంచ్ కొమ్ముదీపిక పాల్గొన్నారు.

బిడ్డల భవిష్యత్తుకై ఎస్టీ రిజర్వేషన్ సాధించుకుందాం

పత్తికొండ టౌన్: బిడ్డల భవిష్యత్తుకై ఎస్టీ రిజర్వేషన్‌ను సాధించుకుందామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. పత్తికొండలో వాల్మీకి జయంతిలో పాల్గొన్నారు. వాల్మీకులు ఆదోని రోడ్డు పెట్రోల్ బంకు నుంచి టీడీపీ కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, మహర్షి మీడియా ఎండీ మద్దిలేటి, వాల్మీకి అంజి, రాముడు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ సోమశేఖర్, టీడీపీ నాయకులు బీటీ గోవిందు, ఎంపీటీసీ చక్రాల రాజు, తిరుపాల్‌నాయుడు, పురుషోత్తం, కప్పట్రాళ్ల మల్లికార్జున, గోవర్ధన్ నాయుడు, ఏవీ నాయుడు, మహేష్ నాయుడు పాల్గొన్నారు.

ఆలూరు: స్థానిక బస్టాండ్‌లో వాల్మీకి విగ్రహానికి ఎమ్మెల్యే విరుపాక్షి పూలమాల వేశారు. అలాగే మెయిన్ బజార్‌లో ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, మహిళ నాయకురాలు వైకుంఠం జ్యోతి పూలమాల వేశారు.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిప్పగిరి లక్ష్మీనారాయణ, వీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాంభీమ్ నాయుడు, సరేంద్ర, మాదన్న, లోకేష్, చంద్రశేఖర్ నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మారయ్య మద్దు రంగ, వెంకన్న, అరికెర వెంకటేశ్వరులు, వరుణ్, భాస్కర్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

వెల్దుర్తి: వాల్మీకి సేవా సంఘం ఆధ్వర్యంలో పాతబస్టాండ్ కూడలి వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు గోపినాథ్ నాయుడు, రామచంద్ర నాయుడు, బోయపాటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: వాల్మీకి ఆదర్శ ప్రాయుడని తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.

తుగ్గలి: పగిడిరాయి, జొన్నగిరి, పగిడిరాయి, కొత్తూరు, రాంపల్లె, ఉప్పర్లపల్లె తదితర గ్రామాల్లో జయంతి నిర్వహించారు. పగిడిరాయిలో ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు అన్నదానం చేశారు. సాయంత్రం ఊరేగింపు నిరర్వహించారు. బీపీఎస్ రామాంజనేయులు, బాలన్న, నక్కల రమేష్, సంగాల కృష్ణ, రఘు, తిరుపాల్ నాయుడు, మైరాముడు, రాంపల్లి శ్రీనివాసులు, చెన్నకేశవులు, డీలర్ సుంకన్న, హనుమంతు, రంగన్న పాల్గొన్నారు.

మద్దికెర : మండలంలోని మద్దికెర, మదనంతపురం తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యాలయంలో తహసీల్దార్ హుశేన్‌సాహెబ్, మదనంత పురం గ్రామంలో టీడీపీ నాయకుడు సంజప్ప, పెరవలి గ్రామంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు నిర్వహించారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మద్దికెరలో అన్నదానం నిర్వహిం చారు. సాయంత్రం వాల్మీకి విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు.

అభివృద్ధే ధ్యేయం

తుగ్గలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు వెంకటపతి అన్నారు. గురువారం చెన్నంపల్లి, రామలింగాయపల్లె గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. మాజీ ఎంపీపీ కొమ్మె వెంక టేశ్, తిరుపాల్ నాయుడు, చంద్రశేఖర్ యా దవ్, మాబాషా, రాజేంద్రగౌడు, లక్ష్మీ నారాయణ చౌదరి, దేవేంద్ర, అక్బర్, కోటేష్ గౌడ్, రామయ్య, ఏపీవో హేమసుందర్, కార్యదర్శి కార్తిక్, ఈసీ ప్రదీప్ కుమార్ ఉన్నారు.


రామలింగాయపల్లెలో భూమి పూజ చేస్తున్న నాయకులు

సీఎం చంద్రబాబుతో మహర్దశ

హాలహర్వి, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే పల్లెబాటలకు మహర్దశ వచ్చిందని టీడీపీ తాలూకా ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం నిట్రవటి, హాలహర్వి గ్రామాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. మండలానికి రూ.3.5కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, 45 గోకులం షెడ్లకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ అభివృద్ధి చూస్తూంటే ప్రతి పల్లెల్లో పండగ వాతావరణం ఉందని, పంచాయతీలకు సైతం టీడీపీ రాకతో పూర్వవైభవం వచ్చిందని తెలిపారు. సర్పంచులు ఉత్సాహంగా ఉన్నారని, గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు. త్వరలో వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఆలూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కన్వీనర్ సుధాకర్, గ్రామ సర్పంచ్ మల్లికార్జున, ప్రహల్లాదరెడ్డి, గూళ్యం మీసాల పంపాపతి, శ్రీధర్, ఎంపీడీవో వరలక్ష్మి, ఏపీవో చక్రవర్తి పాల్గొన్నారు.


నిట్రవట్టిలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్

ఆర్డీఎస్‌కు పోటెత్తిన వరద

కోసిగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగసనూరు సమీపంలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద నీరు పోటెత్తింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో తుంగభద్ర నదికి నీటి ప్రవాహం రావడంతో ఆర్డీఎస్ ఆనకట్ట పై నుంచి వరద నీరు దిగువకు పరుగులు పెడుతోంది. నదితీర ప్రాంతాల ప్రజలు, మేకల కాపర్లు, రైతులు, చేపలు పట్టేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు గ్రామాల్లో దండోరా వేయించారు.

మఠానికి రూ.11.22 లక్షల విరాళం

మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మఠంలో వివిధ పనులకు భక్తులు రూ.11.22లక్షలు విరాళమిచ్చినట్లు ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. అమెరికాకు చెందిన ఉదయ రంగప్ప మఠానికి రూ.9లక్షలు, అభివృద్ధి పనులకు, రూ.లక్ష అన్నదానానికి 11వేల అమెరికా డాలర్లు(రూ.10 లక్షలు) విరాళం ఇవ్వగా, బెంగుళూరుకు చెందిన మరో భక్తుడు డాక్టర్ ప్రహ్లాద కడంబీ రూ.1.22 లక్షలు శాశ్వత సేవకు విరాళం ఇచ్చారన్నారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారని, దాతలకు పీఠాధిపతి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

కులుమాలలో పల్లెపండుగ



భూమి పూజ చేస్తున్న అధికారులు, నాయకులు

గోనెగండ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కులుమాల గ్రామంలో గురువారం పల్లెపండుగ కార్యక్రమంలో సీసీరోడ్లు, డ్రైనేజి పనులకు అధికారులు, టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఉపాధిహామీ ఈసీ ఉస్మాన్ మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20లక్షల తో సీసీరోడ్లకు పనులు ప్రారంభించామన్నారు. టీడీపీ నాయకులు రాముడు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి



భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్ అన్నారు. గురువారం మాలపల్లి, చౌలహల్లి, సుంకేశ్వరి గ్రామాల్లో పల్లె పండుగ నిర్వహించారు. రోగెప్ప, లక్ష్మన్న, ముత్తురెడ్డి, రామాంజనేయులు, చావిడి జయరాముడు పాల్గొన్నారు.

కార్తీక మాస దీపోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీ మఠంలో కార్తీక దీపోత్సవం కన్నుల పండువగా ప్రారంభమైంది. గురువారం రాత్రి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఊంజల మండపంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పూజలు చేసి హారతులు ఇచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తా : ఎమ్మెల్యే



కడివెళ్ల గ్రామంలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): కడివెళ్ల గ్రామంలో తరతరాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యను తీరుస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం కడివెళ్లలో పల్లెపండుగ నిర్వహించారు. పారిశుధ్యం, సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి కుళాయిల ఏర్పాటుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రూ.50లక్షల పనులకు భూమి పూజ చేశారు. తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో బంగారమ్మ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఏపీవో విజయ్‌మోహన్, ఏఈ జయన్న, సర్పంచ్ రంగస్వామి, గొల్ల హనుమంతు, ఎంపీటీసీ హనుమంతు, రంగనాయకులు, గుంటెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రతి పనికీ ఓ రేటు



- ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్ల దందా
- మామూలు ఇవ్వందే పని కాదు!
- నెలకు దాదాపు రూ.6లక్షల వరకు దందా

ఎమ్మిగనూరు, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. ఏ పని కావాలన్నా ఓ రేటు నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. భూములు, ఇళ్ల, స్థలాల వివరాలు పొందాలంటే ప్రభుత్వం నిర్ణయించిన మేరకు చలానా కడితే సరిపోతుంది. అయితే కార్యాల యంలో దందా నడుస్తోంది. రోజుకు ఈసీల కోసం 50కి పైగానే దరఖాస్తులు వస్తుండగా నకళ్ల కోసం 40-50 దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ప్రతిరోజు రూ.20నుంచి రూ.25 వేలు అక్రమంగా దండుకుంటున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన నెలకు దాదాపు రూ.5నుంచి రూ.6లక్షల వరకు దందా నడుస్తోంది

నిబంధనలు ఇవీ..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30ఏళ్లలోపు ఈసీ కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.220లు చెల్లించాల్సి ఉంది. అలాగే 30ఏళ్ల పైబడి ఈసీ కావాలంటే రూ.520లు చెల్లించాలి. ఇక నకళ్ల (కంప్యూటరైజ్డ్)కోసం రూ.320లు చెల్లించాల్సి ఉండగా, పాత రికార్డుల నకళ్ల కోసం రూ.220లు చెల్లించాలి.

వసూళ్లు ఇలా..

అయితే ఇక్కడ మాత్రం అధిక మొత్తంలో ఫీజులు వసూళ్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. 30ఏళ్లలోపు ఈసీ కోసం రూ.400లు, 30ఏళ్ల పైబడిన ఈసీ కోసం అయితే రూ. 800, నకళ్ల కోసం అయితే రూ.600లు చెల్లిస్తేగాని ఇవ్వడంలేదు. అదనంగా మరో రూ.వెయ్యి చెల్లించారంటే ఇక ఒక్కరోజులో పనిచేసిపెడుతున్నారు. డబ్బులు ఇవ్వని వారికి మాత్రం రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు.

సమర్పించుకోవాల్సిందే

ఈసీ(ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్), నకళ్ల కోసం దరఖాస్తు చేస్తే సరిపోదు ఎంతో కొంత సమర్పించుకోవాల్సిందేనని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది తమ నుంచి అధిక మొత్తంలో దండుకుంటున్నట్లు ఆరోపిస్తున్నారు.

ఇటీవలే బదిలీపై వచ్చాను..

ఇటీవలే బదిలీపై వచ్చాను. గతంలో ఇక్కడ ఏం జరిగిందో నాకు తెలియదు. ప్రస్తుతం రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలకు ఇతర వసూళ్ల చేయడం లేదు.

- శ్రీనివాసులు, సబ్ రిజిస్ట్రార్, ఎమ్మిగనూరు.

వలసల కథనంపై స్పందించిన ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): గురువారం ఆంధ్రజ్యోతి పత్రికలో "వంద కుటుంబాలు కుటుంబాలు వలస" శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే బీవీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కడివెళ్లలో పల్లెపండుగ నిర్వహించారు. అనంతరం అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గుడికల్లు గ్రామం నుంచి కూలీలు వలసలు వెళ్తున్నారని.. మీరు పనులు చూపడం లేదా అని ఎంపీడీవో బంగారమ్మ, ఏపీవో విజయ్‌మోహన్‌ను ప్రశ్నించారు. గ్రామాల్లో కూలీలు వలసలు వెళ్తుంటే మీరేమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఏపీవో విజయ్ మోహన్ కూలీలందరికి పనులు కల్పిస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వాల్మీకి జయంతి



కనకవీడులో నివాళి అర్పిస్తూ..

నందవరం, అక్టోబరు 17 (ఆధ్రజ్యోతి): మండలంలోని కనకవీడు, నందవరంలోని తహసీల్దారు కార్యాలయంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్ఐ జర్మీయా, కనకవీడులో డబ్బా ఈరన్న ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మాన్‌దొడ్డి ఈరన్న, ప్రభాకర్, దుబ్బన్న, మునిస్వామి,సురేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఎమ్మిగనూరు టౌన్,అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల సమావేశం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు మాట్లాడుతూ సమాన పనికి - సమాన వేతనం గ్రాట్యూటి, కారుణ్య నియమాకాలు, మెడికల్ సెలవులు, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. యు లక్ష్మన్న, తిక్కయ్య, ఇస్మాయిల్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో అభివృద్ధి

నందవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లె పండగతోనే అన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ బీసి సెల్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఈరన్నగౌడు అన్నారు. ముగతి, మిట్టాసోమాపురం గ్రామాల్లో పల్లె పండగ నిర్వహించారు. రూ 10లక్షలతో సీసీ రోడ్లరు, గోకుల షెడ్లను ప్రారంభించారు. ముగతిలో జల్‌జీవన్ కింద రూ 30లక్షలు మంజురయ్యాయని ప్రతి ఇంటికి తాగునీరు అందుతుందన్నారు.

పొలంలో నీరు.. రైతు కంట కన్నీరు



బి. అగ్రహారం గ్రామం పత్తి పొలంలో నిలిచిన వర్షపు నీరు

- ఎడతెరిపి లేని వర్షాలతో ఉల్లి, పత్తి, వేరుశనగ నీటమునక
- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాధికారులు

గోనెగండ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు నిలిచి, రైతు కన్నీరు పెడుతున్నాడు. మండలంలో పత్తి, ఉల్లి, వేరుశనగ పంటకు వర్షం తీవ్రనష్టాన్ని కలిగించింది. గంజహళ్లి, గోనెగండ్ల, ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, వేముగోడు, గాజులదిన్నె తదితర గ్రామాల్లో ని పత్తి పొలాల్లో వర్షం నీరు నిలిచింది. పత్తి పంట దెబ్బతింటుందని రైతులు ఆదోళన చెందుతున్నారు. గంజహళ్లి గ్రామానికి చెందిన వలి, ఐరన్‌బండకు చెందిన హుసేన్ పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. నియోజకవర్గంలోని గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. పత్తి 20వేల హెక్టార్లలో, ఉల్లి 6వేల హెక్టార్లలో సాగు చేయగా, 5వేల హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు.

నీరు నిలవడంతో వైరస్..

వర్షం కారణంగా పత్తి పొలాల్లో వర్షపు నీరు నిలవడంతో పంట కుళ్లిపోవడమే గాక వైరస్ సోకింది. దీంతో ఆకులు పసుపచ్చగా మరుపోతున్నాయి. కాయలుచ పూత రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లికి నీరు అధికం కావటంతో మజ్జిగ తెగులు సోకింది. ఇక వేరుశనగ పంట వర్షం కారణంగా నల్లగా మారి పోవడంతో పశువులకు గ్రాసంగా కూడా పనికిరాదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పశుగ్రాసం కూడా దక్కలేదు

రెండెకరాల్లో వేరుశనగ సాగు చేశాను. రూ. 60వేల పెట్టుబట్టి పెట్టా. పంట ఏపుగా పెరిగింది. అయితే మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో పంట దెబ్బతింది. మొక్కలు రంగు మారాయి. దీంతో పశుగ్రాసం కూడా దక్కలేదు. - హుసేన్, ఐరన్‌బండ

నీరు నిలిస్తే తీసుకోవలసిన జాగ్రత్తలు

నీటిని వాలు గల ప్రదేశం నుంచి బయటకు పంపివేయాలి. డీఏపీ ఎకరానికి 3 కేజీల ప్రకారం నీటిలో కరిగించి ప్రతి మొక్క తడిచేలా పిచికారీ చేయాలి. చీడ పీడల బారి నుంచి కాపాడుకోడానికి ట్రైకోడర్మ విరిడి 8-10 గ్రాములు, లేదా టెబుకోన జోల్ 250 మిల్లీ లీటర్లు లేదా ప్రాపికొనజోల్ 250 గ్రాములు మొక్కలు తడిసే విదంగా పిచికారీ చేయాలి. పొలంలో నీటిని తీసివేశాక 17.17.17, లేదా 19.19.19 పిచికారీ చేసుకోవాలి. ఈ సూచనలు పాటిస్తే పంటలకు కలిగే నష్టలను నివారించవచ్చు

- మహమ్మద్ ఖాద్రీ ఏడీఏ, ఎమ్మిగనూరు.

రెండెకరాల్లో పత్తి సాగు చేశా

రెండెకరాల్లో పత్తి సాగు చేశాను. పంట బాగానే పెరిగింది. చెట్లుకు ఉన్న పత్తి తీసే సమయానికి ఎడతెరిపిలేని వర్షాలతో పొలాల్లో నీరు నిలిచింది. పంట రంగు మారి, పూత కూడా రాలిపోతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

- కబుల్, రైతు, గోనెగండ్ల

బలహీన వర్గాలకు అండగా టీడీపీ



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ



మంత్రాలయం: రచ్చుమర్రిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



కోసిగి : టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

ఎమ్మిగనూరు, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం సభలో మాట్లాడుతూ వాల్మీకి చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలన్నారు. తన తండ్రి మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి బీసీలకు అండగా నిలిచారని, ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఆయన తనయుడిగా నన్ను కూడా ప్రజలు ఆశీర్వదించి రెండోసారి గెలిపించారన్నారు. తనతండ్రి వాల్మీకుల కోసం రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని కేటాయించారని, తాను 2014లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో భవన నిర్మాణానికి రూ.65 లక్షలు మంజూరు చేయించానని అన్నారు. మాజీ ఎంపీపీ శంకరయ్య, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వీజీఏ దయాసాగర్, ఏఈ మల్లయ్య, ఉసేని, రామకృష్ణానాయుడు, వీజీఆర్ కొండయ్య, బీఎల్ నారాయణ, బచ్చాల రంగన్న, యాపిలయ్య, జయన్న, అంజి, లచ్చన్న, వాల్మీకి రాజు, ఉరుకుందు, గిడ్డయ్య, టీచర్ నాగమణి, శ్రీనివాసనాయుడు, యల్లంభీడు లక్ష్మన్న పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణి నివాళి అర్పించారు. గుడికల్లు, కడివెళ్ల, కలుగొట్ల తదితర గ్రామాల్లో జయంతిని ఘనంగా నిర్వహించారు. కడివెళ్ల గ్రామంలో జరిగిన వాల్మీకి జయంతిలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాస్‌మాన్‌దొడ్డి ఎంపీపీ పాఠశాలలో హెచ్ఎం శాంతిరాజు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. రంగనాయకులు, డీలర్ ఈరన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మంత్రాలయం: బసాపురంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, రచ్చుమర్రిలో టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాళి అర్పించారు. మంత్రాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటి రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మన్న, టీడీపీ మండల అధ్యక్షులు పన్నగ వెంకటేశ్ స్వామి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, గురెడ్డి భీమిరెడ్డి, విశ్వనాథరెడ్డి, రామకృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి నివాళి అర్పించారు. రచ్చుమర్రిలో వాల్మీకి విగ్రహానికి భూమి పూజ చేశారు. తహసీల్దార్ రవి, భోజరాజు, ప్రిన్సిపాల్ శాంతి, ప్రసాద్, ఎంపీడీవో శోభారాణి పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంగితో పాటు కందుకూరు, జంపాపురం, డి.బెళగల్, దుద్ది, వందగల్లు, కోల్‌మాన్‌పేట, ఆర్లబండ తదితర గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. కోసిగిలో వాల్మీకి యూత్ వేడుకల్లో టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి వేర్వేరు సమయాల్లో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. వాల్మీకులు ఐక్యంగా ఉండి ఎస్టీ రిజర్వేషన్ కోసం పోరాడాలన్నారు. ముత్తురెడ్డి, రామిరెడ్డి, అయ్యన్న, తాయన్న, జ్ఞానేష్, రాముడు, వెంకటేశ్, చింతలగేని నర్సారెడ్డి, భరద్వాజశెట్టి, అమర్నాథ్ రెడ్డి, వీరారెడ్డి, శ్రీను, పంపాపతి, మాదేవ, ఈరయ్య, నర్సన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి వాల్మీకి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్షీరాభిషేకం చేశారు. జిల్లా వాల్మీకి సంఘం నాయకులు, జిల్లా టీడీపీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, మండల ఉపాధ్యక్షుడు మురళినాయుడు టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ రమేష్‌నాయుడు, ఉరుకుందు, ఎల్ఐసీ రంగస్వామి, శ్రీధర్, రంగస్వామి, మేకలమునెప్ప, ఉల్చాల రంగన్ననాయుడు, రామయ్య, గోవిందు, రామకృష్ణ, వెంకటేష్, పుట్టపాశంలో బీటీ బడేసాబ్, బీటీ శ్రీనివాసులు, బీటీ విజయ్, బీటీ గణేష్ బీటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

కౌతాళం: బదినేహాల్, ఉరుకుంద, కుంటనహాల్, రౌడూరు, ఎరిగేరి, మరళి గ్రామాలలో నివాళి అర్పించారు. గిరి, నక్రితిక్కయ్య, గొట్టయ్య పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: బస్టాండ్ ఆవరణలోని వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. టీడీపీ యువ నాయ కుడు రామకృష్ణారెడ్డి, తెలుగు రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవరమాకాంతరెడ్డి హాజరయ్యారు. బసలదొడ్డి ఈరన్న, మీసేవా ఆంజనేయులు, మల్లికార్జున, యేసేబు, వీరేష్‌గౌడు, ఈరన్న, మొట్రు రామాంజనేయులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు



ప్రాంగణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, అక్టోబరు 17: శ్రీమఠం గురువారం భక్తులతో కిక్కిరిసింది. దక్షిణాది రాష్ట్రాలనుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, ప్రధాన రహదారులు, మధ్వమార్గ్ కారిడార్, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్ న్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. .

భరతనాట్యం

బెంగుళూరు, చెన్నై నృత్య కళాకారులు నిర్వహించిన భరతనాట్యం, సంగీతకచేరీ భక్తులను ఆకట్టుకుంది. ఊంజలమండపం, యోగీంద్ర కళామండపంలో వేర్వేరు సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి కళాకారులను ఆశీర్వదించారు. ఓంశ్రీ బాలత్రిపుర సుందరీ అకడమి వారిచే భరతనాట్యం సూర్యనారాయణమూర్తి, కృత్రికర, నీరజ్, కావ్య, భార్గవి, హరిణి తదితరులు భరతనాట్యంలో తరించారు.

బృంధావనానికి అభిషేకం

మఠంలో చెన్నైకి చెందిన దాదాపు 2వేల మంది భక్తులు 1,118 లీటర కలశాలతో అభిషేకం చేశారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, కళశాల జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం బృందావనానికి క్షీరాభిషేకం చేశారు. పీఠాధిపతి పాలతో అభిషేకం చేశారు.

పీఠాధిపతికి తులాభారం..

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు ఐడీఏఆర్‌సీ ఆధ్వర్యంలో తులాభారం చేశారు. ఒక వైపు పీఠాధిపతిని కూర్చోబెట్టి, మరోవైపు నాణెలు, సుగంధ్ర ద్రవ్యాలు, వివిద రకాల ధాన్యాలతో తులాభారం చేశారు. అనంతరం తులాభారంలో పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి ఆశీస్సులు ఇచ్చారు. విద్వాన్ రాజా గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషి, శ్రీపతా చార్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులతో సీఐ పుట్టినరోజు సంబరాలు



మంత్రాలయం సీఐ పుట్టినరోజు వేడుకల్లో టీడీపీ నాయకులు

కర్నూలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సీఐ రామాంజులు పుట్టినరోజు వేడుకలను టీడీపీ నాయకులతో కలిసి చేసుకున్నారు. సర్కిల్ కార్యాలయంలో టీడీపీ నాయకులు వరదరాజులు, డేవిడ్, శ్రీనివాసులు, నరసింహులు, చిదానంద, రాజుతో కలిసి సీఐ కేకు కట్‌చేసి చేశారు. పోలీస్ స్టేషన్‌లోనే ఓ పార్టీ నాయకులతో ఇలా చేయడం ఏంటని చర్చ సాగుతోంది. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సీఐ వ్యవహారం తీరుపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఏం చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.